# డోరియా ఇచ్చిన టోకరా

## రుద్రాభట్ల నరసింగరావు

నేను మంచి ధైర్యం వున్నవాడిని. ఇది మీరు మనస్సులో పెట్టుకోకపోతే నేను కాకినాడ వెళ్ళినప్పుడల్లా మా వూరికి దగ్గరలో వున్న వూరికి వొచ్చే ఆఖరి బస్సునే ఎందుకు అందుకుని వస్తానో అర్థం చేసుకోలేరు. అది ఆ వూరు రాత్రి పది గంటలకు చేరుకుంటుంది. అక్కడినించి జనసంచారం లేని రోడ్డు వెంట రెండున్నర మైళ్ళు నడిచి రావాలి. కాకినాడలో మా అత్తవారుగాని వున్నారనుకుంటారేమో, లేరు. ఆ ఊరంటేనే నాకిష్టం. మా ఊరని నే ననేది నేను పనిచేసే ఒక మారుమూల గ్రామం. అదీ ఒక అభిమానమే.

ఒకసారి ఇలాగే ఆఖరి బస్సు దగి ఇంటికి వస్తున్నాను. ఇల్లంటే నేను తాళం వేసుకొచ్చిన గది.

కాకినాడలో రెడీమేడ్‌లో కొన్న కొత్తబట్టలున్నాయి నా ఒంటిని. చేతిలో బేగ్‌లోనూ కొన్న వేవో వున్నాయనుకోండి.

నేను వేసుకున్న చొక్కా తెల్లనిది. దాని వయిపు ఒకసారి చూసుకుని 'ఆఁ చీకటిలో ఎదరనించి వొచ్చే ఎవరికయినా నేను కనబడ డానికి ఈ చొక్కా కొంత పనికొస్తూనే వుంది' అనుకున్నాను. పేంటు మట్టుకు శ్యామలవర్ణానిది. ఇంగ్లీషులో ఈ రంగుని జంగిల్‌గ్రీన్ అంటారు. పేంటుకి దారంతో పోగులు తీసి కుట్టినట్టు అదోరకమయిన డోరియా ఉంది. గుడ్డ కాస్త పెళుసుగా వుంది. అప్పటి కాలాన్ని బట్టి కొంత వొదులుగా వుంది పేంటు.


అది ఒక తారురోడ్డు. ఇటూ అటూ మర్రి చెట్లూ, పొలాలూ వున్నాయి. దారిలో ఒకటి రెండు గుట్టలు, ఒక చిన్న ఏరు, దానిమీద వంతెన కూడా తగులుతాయి. మన రోజులు బాగులేకపోతే యింకేమయినా తగలొచ్చు అది వేరే సంగతి.

నేను కొంతదూరం వెళ్ళేసరికి ఎక్కడో దూరంగా చీకట్లోంచి "అబ్బాయి అగ్గుందా?" అన్న కేక వినబడింది.

ఇలాటి కేక దొంగలు వేస్తారనే, వుందనో








లేదనో అంటే కొత్తవాడని తెలుసుకుని దగ్గర కొచ్చి మీద పడతారనీ మాట్లాడకుండా వొచ్చేస్తే ఇక్కడివాడే అనుకుని జడిసి ఆగి పోతారనీ నాకు గ్రామస్థులు ఒకసారి చెప్పేరు.

నేను ఆ సలహా ప్రకారమే చేస్తాను ఎప్పుడు రాత్రిపూట ఈ దారిన వచ్చినా. ఇప్పుడూ అదే చేసేను. వినిపించుకోనట్టు ముందుకి సాగిపోయేను.

పైన నక్షత్రాలున్నా చీకటే చీకటి. మర్రి చెట్లూ, ఊడలూ మొదలయినవి నీడలుగా మాత్రం కనబడుతున్నాయి. నేను ఆధునిక చిత్రకళతో పరిచయం వున్నవాడిని. ఆకారాన్ని చితగ్గొట్టి భావానికి ప్రాణప్రతిష్ఠ చేస్తారు-ట ఆ చిత్రకారులు. వాళ్ళు ఇలాటి సమయంలో ఇక్కడికొస్తే (చెట్లూ మొదలయినవాటి ఆకారాల్ని చితకగొట్టి, అవి కల్పించే భావం అయిన) దెయ్యాల్నీ, భూతాల్నీ చిత్రిస్తారేమో!

వంతెన దాటేను. అప్పటిదాకా గాలి లేదు గాని అప్పటినించి కొంత గాలి వీచడం మొదలు పెట్టింది.

నేను నడుస్తున్నాను.

కొంతసేపటికి నా వెనకాల ఎవరో వొస్తున్నట్టనిపించింది. చిన్న క్రమంతప్పని చప్పుడు.

ఆగి వెనక్కి తిరిగి చూస్తే ఎవరూ లేరు గాని చప్పుడు మాత్రం ఆగిపోయింది.

చప్పుడు ఆగిపోవడంతో అనుమానం వచ్చింది!

ఏవరో వెంబడిస్తూ నేను ఆగిన వెంటనే తనూ ఆగినట్టు అనుకోవడానికి అడ్డేమిటి?

మరొకడయితే అప్పుడే భయపడే వాడేగాని నేను మట్టుకు నడవడం మొదలెట్టేను మళ్ళీ.

మళ్ళీ అదే చప్పుడు గరగర....గరగర....

ఈసారి ఆ చప్పుడుని స్టడీ చెయ్యడానికి-ఎలాటిదో ఏమిటో జాగ్రత్తగావిని తెలుసుకోవడానికి-కొంతదూరం నడిచి అప్పుడు ఆగేను.

నేను ఆగిన వెంటనే ఒక లిప్తకాలం ఆలస్యం లేకుండా ఆ చప్పుడూ ఆగిపోయింది.

మనుష్యులకి అలా ఆగడం అసాధ్యం.

దెయ్యాలమీద చదివిన వాదోపవాదాలూ, కథలూ, మధుమతిలాటి సినీమాలూ జ్ఞాపకం వస్తున్నాయి.

శ్రీకాంత్, వస్తాదు వీరన్నల ఉదంతాలు చెప్పేదేమిటి? ధైర్యం మనకి శ్రీరామరక్ష. భయం మన పాలిటి మృత్యుదేవత అనేగదా.

నేను ఎవరికీ తీసిపోయినవాడిని కాదలుచుకో లేదు. నడుస్తున్నాను.

మళ్ళీ అదే చప్పుడు గరగర....గరగర....

ఆగి ఆలోచిస్తున్నాను. 'బతుకను బాటను ఒంటరిగా నడచియేపోవలె వడి వడిగా' అన్న సినిమా పాట జ్ఞాపకం వచ్చింది. వేగంగా నడిచి చూస్తేనో.

గబగబ కొంతదూరం నడిచి, ఆ గర గర మరింత ఎక్కువగానూ జోరుగానూ వినిపించే సరికి రోడ్డు పక్కకి వెళ్ళి నిలబడ్డాను—ఆ వొచ్చేవాళ్లెవరో నన్ను దాటుకుని ముందుకి వెళ్ళిపోతారేమో అన్న వుద్దేశంతో.

చిత్రం ఏమిటంటే, ఆ చప్పుడూ నాతో బాటే పక్కకి వచ్చి ఆగింది. అంతేగాని ముందుకి వెళ్ళింది ఎవరూ లేరు.

కొంతసేపు ఆగి మెల్లిగా రోడ్డు మధ్యకి వొచ్చేను. చప్పుడూ మెల్లిగా రోడ్డు మధ్యకి వొచ్చింది.

ఇహ నిలబడి స్థిమితంగా ఆలోచించడం ఒక్కటే మిగిలింది.

ఆగి ఆలోచిస్తున్నాను. గాలి వేసేదాకా ఈ చప్పుడు లేదు. అంటే గాలిని బట్టి కదులు తున్న దేనివల్లో ఈ చప్పుడవుతున్నట్లుంది. మరి ఆగినప్పుడు లేదేం? నడుస్తున్నప్పుడు, గాలికి కదిలేది ఏది?

కనుక్కోవడానికి నడిచేను-కిందకి చూస్తూ.

పేంటు కాలు గాలికి లోపలి వైపుకి పొంగు తోంది. కాళ్ళు ఒకదానితో ఒకటి రాపాడించు కుంటున్నాయి.

డోరియా గుర్తొచ్చింది.

గరుకు ఉపరితలాలు ఒకదానితో ఒకటి రాపాడించుకుంటున్నప్పుడు పుడుతున్న ధ్వని అది.

డోరియా ఇచ్చిన టోకరా.

ఏదో కనుక్కున్న విజ్ఞానవేత్తలా ఆనం దిస్తూ మిగిలిన మైలున్నర మేరా ఆగుతూ నడుస్తూ ఊరు చేరేను.

ఊరి వెలుపల ముసాఫీర్‌ఖానా (పాంథ శాల)లోని గు(బు)డ్డి దీపం కనబడేసరికి అందు లోని వాళ్ళని లేపి నా అనుభవాన్ని చెప్పేద్దామా అనిపించి తమాయించుకుని, నా గదిలోకి చేరు కున్నాను. □

---


# దీపావళి ప్రత్యేక సంచిక

## 1980

ఎప్పటిలానే జ్యోతి ఈ సంవత్సరం కూడా తన పాఠకులకు దీపావళి ప్రత్యేక సంచికను తన ప్రత్యేక బాణీలో రూపొందించి సమర్పిస్తుంది.

మీరు మెచ్చే కథలూ, కవితలూ, కార్టూన్లూ, ఇతర ఆకర్షణలతోపాటు ప్రత్యేకాకర్షణగా ఒక పూర్తి నవల ప్రత్యేక సంచికలో ప్రచురించబడుతుంది.

ముఖచిత్రాన్ని 'బాపూ' అలంకరిస్తారు

200 పేజీలకు పైబడిన ఈ ప్రత్యేక సంచిక దీపావళికి పదిరోజులు ముందే మీ ముందుకొస్తుంది.

రచనలు ఆగస్టు 15లోగా మాకు చేరేలా పంపవలసిందిగా రచయితలను కోరుతున్నాము.

జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక కొనడం దీపావళికి ముందే పండగ జరుపుకొనడం!


---

# ఓ ఇంటి రామాయణం


— మొవ్వ. బాబూరావు


ఆకాశం పేథాస్‌గా 'శ్రీరంజని మొహంలా వుంది ఎప్పుడు అవకాశం వస్తుందా వాన కురిపిద్దామని.

మేఘాలు మాయాబజారులో యస్వీఆర్ గర్జించినట్లు గర్జిస్తున్నాయి.

ఇంట్లో అలారం హిజ్ మాస్టర్స్ వాయిస్ రికార్డులా ఇష్టం వచ్చినట్లు మ్రోగిపోతోంది.

గాఢ నిద్రలో ఇహం మరచిపోయి నిద్ర పోతున్న సుబ్బారావుకి పిచ్చికోపం వచ్చింది అలారం చేస్తున్న శబ్దానికి.

బంగారంలాంటి కల బంగాళాఖాతంలో కలిసిపోయినట్లనిపించింది.

చురుక్కుమంటే తొడమీద కసిగా చేయి వేసి చేత్తో నలిపాడు.

కావలసినంత జ్యూసు తాగేసి దుప్పట్లో దూరిపోయింది సుబ్బారావుకి అందక వారం రోజులనుంచి ఆ దుప్పట్లోనే దినదినాభివృద్ధి అవుతున్న నల్లిపిల్ల.

అలారం కూత ఆపింది స్టేషన్‌లో నుంచి వెళ్ళిపోయిన రైలుబండీలా.

చిరాగ్గా, బద్ధకంగా వొళ్లు విరుచుకుంటూ లేచాడు సుబ్బారావు భార్య చేతిని పక్కకు పెడుతూ.

"తాయారూ లే!" నిద్రాదేవి ఒడిలో హాయిగా పడుకున్న భార్యని ఒక కుదుపు కుదిపాడు.

"అబ్బ! అప్పుడే తెల్లారిందాండీ?" భర్త తన ఒంటిమీదనుంచి తీసేస్తున్న దుప్పటిని లాక్కుని బిడాయించుకుని మళ్ళీ నిద్రలోకి జారిపోయింది తాయారు.

ఖర్మ! ఏనాడు చేసుకున్న పాపమో!

"ఒసేయ్ నిన్నే! ఐదు దాటినట్లుంది. కాస్త తొందరగా లేచి వేణ్ణీళ్ళు తగలెయ్యి" అంటూ లైట్ కోసమని దగ్గర్లో వున్న స్విచ్ ఆన్ చేసాడు.

హూ! సరిపోయింది కరెంట్ లేదు. ఇహ ఇవ్వాళ వెళ్ళినట్లే!

"తాయారు! కరంట్ లేనట్లుంది. అగ్గిపెట్టె తీసి కాస్త లాంతరు వెలిగించు" చీకటిలోనే నుంచుని అన్నాడు.

"అబ్బా! కాస్సేపు పడుకోనీయండి. కరెంట్ ఎలాగూ లేదుగా! కాస్త లేటుగా వెళ్ళకూడదూ....?"

సుబ్బారావుకి చిర్రెత్తుకొచ్చింది.

"ఇందాకట్నుంచి చూస్తున్నాను, నీ నిద్రా నువ్వూనూ! మొగముండాకొడుకు ఆఫీసుకు తగలడాలి, వాణ్ని కాస్త తొందరగా పంపే ఏర్పాటు చేయాలన్న ఉద్దేశం ఏ మూలన్నా వుండి చచ్చిందా!" ఆఫీసర్ జ్ఞాపకం వచ్చే సరికి మరింత రెచ్చిపోయాడు.

తాయారుకు ఒక్కసారి మత్తు వదిలినట్లు అయింది. లేచి కూర్చుంది.

అలా అంటేనే భార్య లేస్తుందని సుబ్బారావుకి బాగా తెలుసు. పయిగా ఆఫీసర్‌గారు జ్ఞాపకం వచ్చారు. ఇంకేం ఇష్టం వచ్చినట్లు మాట్లాడేసాడు.

భార్యని కష్టపెట్టటం తనకి యిష్టం లేదు. కాని ఏం చేస్తాం! తప్పదు! గవర్నమెంటు తమలాంటివాళ్ళ మొహాలమీద అలా రాసారు.

"అగ్గిపెట్టె వంటింటిలో అలమారు మీద వుంది" అడుగులు వేస్తూ అంది తాయారు.

"నువ్వు ఇక్కడే వుండు నేనే నెమ్మదిగా వెళ్ళవస్తాను. ఇంతకీ లాంతరు ఎక్కడ వుంది!